క్లుప్తంగా

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సైదాపురం : కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వికసిత్‌భారత్ - 2047 లక్ష్యమంటూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం సంపన్నులు, కార్పొరేట్ శక్తులకు మాత్రమే మేలు చేకూర్చేలా ఉందని ఆరోపించారు. సామాన్యులు, రైతులు, కూలీలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. విభజన హామీలను పక్కన పెట్టి, రాష్ట్రానికి మొండి చేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పొదుపు సంఘాల బలోపేతమే లక్ష్యం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం : పొదుపు సంఘాలు బలోపేతమే లక్ష్యమని ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక పొదుపు కార్యాలయంలో కమ్యూనిటీ బెస్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పరిపాలన నాయకత్వంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ సమావేశాల నిర్వహణ,, బైలా విశిష్టతపై సలహాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాలను సభ్యులకు ఎలా అందించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం శైలజమ్మ పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ సుబ్బాయమ్మ

సైదాపురం : ఎరువులు, పురుగు మందులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీ సీహెచ్ సుబ్బాయమ్మ హెచ్చరించారు. సోమవారం సైదాపురంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీ మాట్లాడు తూ పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఐఎఫ్‌ఎంఎస్‌లోని దుకాణంలో రికార్డులను పరిశీలించారు. ఏఓ హైమావతి పాల్గొన్నారు.

ఇంటి స్థలాల మంజూరుకు డిమాండ్


దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నేతలు

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు మండలంలోని విందూరు, రామలింగాపురం కండ్రిగలో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టణంలో రెండు సెంట్లు ,గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శశికుమార్, కాలేషా, చంద్రయ్య పాల్గొన్నారు.

వినతుల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, రీసర్వేలో అభ్యంతరాల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం వీఆర్‌ఓలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్, చుక్కల భూములపై వచ్చిన అర్జీలకు సంబంధించి వివరణ ఇస్తే, వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ నెలాఖరులోపు అన్ని సమస్యలను తీర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ఐ పూర్ణ పాల్గొన్నారు.

నెల్లూరుకు తరలిన సీపీఎం శ్రేణులు


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

చిల్లకూరు : నెల్లూరులో నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు సోమవారం మండలం నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టారు. సీపీఎం నేత జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అలుపెరుగని పోరాటం సాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీపీ రమణయ్య, అడపాల ప్రసాద్, సురేష్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

పరిశుద్ధ జలం పేరుతో ప్రజలను పలువురు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు మోసం చేస్తున్నారు. బోరునీటినే క్యాన్లలో నింపి అమ్మేస్తున్నారు. నిబంధనలను ఏమాత్రం పాటించకుండా మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలిచ్చి అపరిశుభ్ర వాతావరణంలో ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. రక్షిత పథకాలు నిరుపయోగంగా మారడంతో గ్రామీణులు సైతం క్యాన్ నీటిపై ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా కొందరు ప్లాంట్ల యజమానులు మినరల్ వాటర్ పేరిట యథేచ్ఛగా దోచుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా జనం జీవితాలతో ఆడుకుంటున్నారు.



మినరల్..జనరల్..!

- నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు
- శుద్ధ జలం పేరిట బోరునీటి విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కోట : ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో విచ్చలవిడిగా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వాటర్‌ప్లాంట్ల యజమానులు నిబంధనలు పాటించడం లేదు. .కొన్ని చోట్ల బోరునీటినే క్యాన్లలో నింపుతూ శుద్ధజలం అంటూ విక్రయిస్తున్నారు. ఓ వైపు వేసవికాలం సమీపిస్తుడడం, మరో వైపు రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరిపడా సరఫరా కాకపోవడంతో గ్రామస్థాయిలో అధికశాతం ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్ల యజమానులు నిబంధనలు పాటించకుండా అయినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సాధారణంగా ఎయిర్‌కండిషన్‌తో పాటు కెమికల్‌ల్యాబ్, మైక్రోబయాలజీ ల్యాబ్, ల్యాబ్‌టెక్నీషియన్, బీఎస్ఐ నిబంధనలకు ప్లాంట్ ఉండాలి. నెలకో రోజు నీటిని వేర్వేరుగా పరీక్షించి రిపోర్టును పంచాయతీ కార్యదర్శికి అందించాలి.అలాగే వాటర్‌ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్ల తయారీకి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి నిబంధనలు పాటించకున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

మండలం	వాటర్‌ప్లాంట్ల సంఖ్య
గూడూరు	33
కోట	26
చిల్లకూరు	14
వాకాడు	12
చిట్టమూరు	15

ప్రజారోగ్యంపై ప్రభావం

ఒక్క కోట మండలంలోనే 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఎక్కడా కూడా నిబంధనలు పాటించడం లేదు. కొన్ని చోట్ల స్థాయికి మించి రసాయనాలు కలిపేస్తున్నారు.మినరల్ వాటర్‌ను క్యాన్లలో రెండురోజులు ఉంచితే చిన్నచిన్న క్రిములు కనిపిస్తున్నాయని మహిళలు వాపోతున్నారు.

అలాంటి నీటిని తాగడం వల్ల టైఫాయిడ్, కామెర్లు, చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కొన్ని చోట్ల క్యాన్లను కనీసం కడగడం లేదు. క్యాన్లలో పేరుకుపోయిన నాచును కూడ శుభ్రం చేయకుండానే నీటిని నింపి విక్రయిస్తున్నారు. కోటలో ఇటీవల ఓ వాటర్‌ప్లాంట్ నుంచి తీసుకువచ్చిన నీటిలో కప్ప కళేబరం కనిపించింది. దీనిపై పెద్ద గొడవ కూడా జరిగింది. అయినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం రాలేదు.

తనిఖీ చేయాలి



చాలా గ్రామాల్లో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తున్నారు.నిబంధనలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. నీటి నాణ్యతను పరీక్షించాలి. అనుమతులు లేని ప్లాంట్లను మూసివేయించాలి. – సుధాకర్‌బాబు, విద్యానగర్, కోట మండలం

ప్రాణాలతో చెలగాటం



మినరల్ వాటర్ పేరుతో ప్రజలను దోచుకుంటూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.నిబంధనలు పాటించని వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి.కొన్ని చోట్ల బోరునీటినే వాటర్ క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు.వాటిని మూసివేయించాలి. – మధు, విద్యానగర్, కోట మండలం

చర్యలు తీసుకుంటాం

ఇటీవల కొన్ని గ్రామాల్లో వాటర్‌ప్లాంట్ల నిర్వహణపై స్థానికుల ఫిర్యాదు చేస్తే పరిశీలించాం.అక్కడ నిబంధనలు పాటించలేదు. దీంతో వారికి నోటీసులు జారీ చేశాం. అదేవిధంగా మండలంలోని అన్ని వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకుంటాం. – వేణు,ఎంపీడీఓ, కోట

వాలీబాల్ విజేత కోనేపల్లె


గెలుపొందిన జట్టుతో శ్రీధనమల్లి యువకులు, నాయకులు

దొరవారిసత్రం: శ్రీధనమల్లిలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను యువత ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఫైనల్స్‌లో సూళ్లూరుపేట మండలం కోనేపల్లె జట్టు శ్రీధనమల్లి జట్టుపై విజయం సాధించింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, సురేష్‌రెడ్డి, మస్తాన్, కిరణ్, సందీప్, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం


లీలమ్మ కుటుంబీకులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

వెంకటగిరిరూరల్ : మండలంలోని పారవోలు దళితవాడలో తుమ్మల లీలమ్మ (65) అనే వృద్ధురాలు మృతి చెందారు. సోమవారం ఈ మేరకు ఆమె అంత్యక్రియల నిమిత్తం స్థానిక యువకుడు వెంకటేష్ రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తుడు వెంకటరామయ్య పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణకు కృషి


విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రం అందిస్తున్న సీసీఎఫ్, డీఎఫ్ఓ, శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి


పక్షుల కేంద్రాల అభివృద్ధికి రూ.10లక్షల చెక్ అందిస్తున్న శ్రీసిటీ డైరెక్టర్ నిరిషా సన్నారెడ్డి

- తిరుపతి సీసీఎఫ్ సెల్వ
- పక్షుల కేంద్రాల అభివృద్ధికి శ్రీసిటీ వితరణ రూ.10లక్షలు

దొరవారిసత్రం: చిత్తడి నేలలు పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, వాటిని పరిరక్షించుకుంటేనే భావితరాలకు అందివ్వగలమని తిరుపతి సీసీఎఫ్ సెల్వ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలోని పర్యావరణ కేంద్రం వద్ద సూళ్లూరుపేట, డీవీ సత్రంలోని పలు పాఠశాల విద్యార్థులకు చిత్తడి నేలలపై స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు అవగాహన కల్పించారు. సీసీఎఫ్ మాట్లాడారు. చిత్తడి నేలలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిత్తడి నేలల ప్రత్యేకత–ఆ నేలల్లో పక్షి జాతుల రకాలు– వాటి పరిరక్షణకు నేలపట్టు, పులికాట్ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు.

పక్షుల కేంద్రాల అభివృద్ధి కోసం శ్రీసిటీలోని సహకారం ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించి పక్షుల కేంద్రాల అభివృద్ధి కోసం శ్రీసిటీ తరఫున రూ.10లక్షల విరాళాన్ని డైరెక్టర్ నిరిషా సన్నారెడ్డి ప్రకటించారు. నేలపట్టు పక్షుల కేంద్రంలో అధికారులకు చెక్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ నిరిషా సన్నారెడ్డి, సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ హారిక, ఎఫ్ఆర్‌ఓలు సౌజన్య, నరసింహారావు, ఎస్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు వస్తే చర్యలు


మురుగు నీటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు

చిల్లకూరు : వరగలి రహదారిపైకి మురుగు నీరు ప్రవహించేలా చేస్తే చర్యలు తప్పవని ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులను పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. మండలంలో తీర ప్రాంత గ్రామమైన చింతవరంలో వరగలి రోడ్డు పక్కన ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వారు పైపును రోడ్డుపైకి పెట్టి మురుగు నీటిని వదలేస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పైపు ఉన్నచోటుకు దగ్గరగా గుంత తవ్వుకోవాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న జైతున్‌బీ

ఓజిలి: రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యానికి శ్రేష్టమని మండల ఇన్‌చార్జి జైతున్‌బీ అన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తుల స్టాళ్లను సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. సహజసిద్ధంగా పండించిన వ్యవసాయోత్పత్తుల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని, తక్కువ ధరకే వీటిని విక్రయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ధనుంజయ, అజిత, యామిని, చెంచమ్మ, మహేశ్వరీ, షబ్బు, ప్రశాంతి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా క్లోరినేషన్


బావిని పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం : మండలకేంద్రంలో ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే బావిలో సోమవారం క్లోరినేషన్ పనులు చేపట్టారు. బావిలో పట్టిన పాచిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, కార్యదర్శి ఇంద్రాణి పర్యవేక్షించారు.

కండలేరులో 54.412 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 54.412 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 100 క్యూసెక్కుల నీరు వస్తోందని వెల్లడించారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

టిడ్కో ఇళ్ల పంపిణీకి డిమాండ్

వెంకటగిరిరూరల్ : టిడ్కో ఇళ్లను లబ్ధిదారులందరికీ వెంటనే పంపిణీ చేయాలని కౌన్సిలర్ ఆరి శంకరయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సుదర్శన్‌నగర్ సచివాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. శంకరయ్య మాట్లాడుతూ 2024లో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని టిడ్కో ఇళ్లు పంపిణీ చేశారన్నారు. 1100 మంది ఇళ్లకు సొంత నిధులు వెచ్చించి విద్యుత్ మీటర్లకు డిపాజిట్ సైతం చెల్లించారని వెల్లడించారు. అయితే 2014లో మంజూరు చేసిన టిడ్కో ఇళ్లన టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓజిలి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఆయా సచివాలయాల్లో అర్హులైన బీసీ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రుణాల కోసం లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతాలతో కలిపి వ్యక్తిగత మొబైల్ నంబర్ లింక్ చేసి 7వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాలను తర్వాత ప్రకటిస్తారన్నారు.

వైభవంగా 'అక్షరాభ్యాసం'



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, చిన్నారులలో అక్షరాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు

సైదాపురం : మండలంలోని సిద్ధలయ్య కోనలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని వైభవంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి అర్చకుడు మునేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

చిల్లకూరు : మండలంలోని పాఠశాలల్లో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ క్రమంలోనే చింతవరంలో ఉన్న రేస పాఠశాలలో కరస్పాండెంట్ బాల చెన్నయ్య నేతృత్వంలో చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.


చిల్లకూరులో..

సామూహిక అక్షరాభ్యాసం

తడ: వసంత పంచమి పురస్కరించుకుని మండలంలో మాంబట్టులోని శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయ అనుబంధ అన్నపూర్ణ అన్నదాన సత్రంలో సరస్వ పూజ నిర్వహించారు. పంచాయతీలోని చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు ఉమ్మిటి చండీరాణి, కుమారస్వామి దంపతులు పలకలు, బ్యాగులతోపాటు ఇతర విద్యాసామగ్రి, ప్రసాదాలు అందజేశారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దలు సీహెచ్ దేవేందర్‌రెడ్డి, కే.వెంకురెడ్డి, రాజేశ్వరమ్మ, లీలావతమ్మ, ముద్దుక్రిష్ణయ్య పాల్గొన్నారు.


సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

ఏడాదిలో ఇళ్ల పంపిణీకి చర్యలు

వెంకటగిరి(సైదాపురం) : టిడ్కో ఇళ్లను ఏడాదిలోపు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు టిడ్కో చైర్మన్ వేమలపాటి అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం వెంకటగిరి పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలోని 25 టిడ్కో గృహాల ప్రాంతాలను పరిశీలించినట్లు వెల్ల డించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పేదల కు మంచి చేయాలనే తపనతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. టిడ్కో గృహాలను తీసుకుని అద్దెకు ఇస్తే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు

నాయుడుపేటటౌన్: విష జ్వరాలు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశించారు. స్థానిక 25 వార్డులోని తుమ్మూరులో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి, లాంఛనంగా వైద్య పరీక్షలు చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. వైద్య శిబిరాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలకు తరలించి, మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ప్రభుత్వ వైద్యులు సుబ్బారావు, రఫీ , మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్ , పసల చిన పెంచలయ్య, గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

–నోటీసు ఇచ్చిన కార్మిక సంఘ నేతలు


కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు

నాయుడుపేటటౌన్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు పూనుకుంటామని మున్సిపల్ కార్మికులు తమ సంఘ నాయకులతో కలిసి అధికారులకు నోటీసు ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు సారథ్యంలో కార్మికులు కమిషనర్ షేక్ ఫజులుల్లాను కలిసి సమ్మె నోటీసు ఇచ్చి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని, హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని, గత సమ్మె కాలపు బకాయిలను చెల్లించాలని కోరారు. సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.2లక్షలు పరిహారం ఇవ్వాలని, కార్మికులందరినీ ఆప్కాస్ పరిధిలోని తేవాలని డిమాండ్ చేశారు. తమ అపరిష్కృత సమస్యలపై స్పందించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు మధు, హరికృష్ణ, రమణమ్మ, మహాలక్ష్మమ్మ, భారతి తదితరులు పాల్గొ న్నారు.

● నగరోత్సవం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని విజయ గణపతి ఆలయంలో రెండ్రోజుల బ్రహ్మోత్సవ సంబరాలు సోమవారం ముగిశాయి. వేంకటేశ్వరస్వామి వారికి వేద పండితులు కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. దాతలతోపాటు చైర్‌పర్సన్‌ను సన్మానించారు. రాత్రి విజయ గణపతి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి, బ్యాండు మేళం, బాణసంచా మోత నడుమ నగరోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'గిట్టుబాటు' లేకపోవడం దారుణం

కోట : ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో జిలకర మసూరాకు నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23వేలు ధర ఇవ్వడంతో రైతులు ఆనందంగా ఉన్నారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం పుట్టి ధాన్యం రూ.17వేలకు పడిపోయిందని ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం తరహాలో అన్నదాతలను ఆదుకోవాలన్నారు.